


*సంపాదించే ప్రతీ వ్యక్తి తన కష్టార్జితాన్ని సురక్షితమైన చోటనే ఉంచాలనుకుంటాడు. పిల్లల విద్య, పెండ్లి కోసమో.. తన పదవీ విరమణ అనంతర జీవితావసరాల కోసమో పొదుపు–పెట్టుబడులకు దిగుతూ ఉంటాడు. అయితే ఇదే సమయంలో రాబడులపై ఓ అంచనా లేక సతమతమయ్యేవారు ఎందరో. కానీ అందుకో లెక్కుంది. అదే రూల్ 72, రూల్ 114 ఫార్ములా. రూల్ 72తో మీరు పెట్టుబడి పెట్టేది రెట్టింపు కావడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకోవచ్చు. అలాగే రూల్ 114తో మూడింతలయ్యేందుకు పట్టే కాలాన్ని అంచనా వేయవచ్చు.*

## 72-114 ఫార్ములా ఇదీ..

### రకరకాల పెట్టుబడులపై వచ్చే రాబడి అంచనాకు సూత్రం


**రూల్** 72 ఫార్ములాను అర్థం చేసుకోవడానికి మీ పెట్టుబడిపై మీకొచ్చే రిటర్న్స్‌ను 72తో భాగించాలి. ఉదాహరణకు మీరు ఏటా లక్ష రూపాయలను పెట్టుబడిగా పెడుతున్నారు. దానిపై 8 శాతం వార్షిక రిటర్న్స్‌ను అందుకుంటున్నారు. ఇప్పుడు 72ను 8 భాగాలుగా విభజిస్తే 9 వస్తుంది. అంటే మీరు పెట్టే పెట్టుబడులు 9 ఏండ్లకు రెట్టింపు అవుతాయన్నమాట. మీ ప్రతీ లక్ష రూపాయలు 9 ఏండ్ల తర్వాత రూ.2 లక్షలుగా మారుతుంది. ఒకవేళ మన పెట్టుబడులు ఎప్పుడు నాలుగింతలవుతాయని తెలుసుకోవాలంటే.. అప్పుడు 72కు బదులు 144ను వినియోగించాలి. 144 ను 8 భాగాలుగా విభజిస్తే 18 వస్తుంది. అంటే 18 ఏండ్ల తర్వాత మీ లక్ష రూపాయలు.. రూ.4 లక్షలవుతుంది. ఒకవేళ ప్రతీ త్రైమాసికానికి మీ పెట్టుబడిపై 3 శాతం వడ్డీ అందితే 72ను 3 భాగాలుగా విభజించాలి. అంటే 24 త్రైమాసికాలు లేదా 6 ఏండ్లలో మీ పెట్టుబడి రెట్టింపవుతుందనుకోవచ్చు. అయితే దీనికీ ఓ పరిమితి ఉన్నది. 5 నుంచి 12 శాతం శ్రేణిలో రిటర్న్స్ ఉంటేనే ఈ ఫార్ములా పనిచేస్తుంది. ఒకవేళ ఈ శ్రేణిలో లేకపోతే రూల్ 71, 73, 74ను వాడుకోవచ్చు. వడ్డీరేటులో పెరిగే ప్రతీ 3 శాతం పాయింట్లకు 72కు 1 చొప్పున కలుపుతూ పోయి ఫార్ములాను ప్రయోగించాలి. ఉదాహరణకు మీ పెట్టుబడిపై 15 శాతం రిటర్న్స్ లభిస్తే.. 73ను 15 భాగాలుగా విభజించాలి. దీన్నిబట్టి దాదాపు ఐదేండ్లలో మీ పెట్టుబడులు రెట్టింపవుతాయన్నమాట. అలాగే ఈ ఫార్ములాతో కచ్చితమైన రిటర్న్స్‌ను అంచనా వేయలేమన్న సంగతి మరువద్దు. అటుఇటుగా సదరు మొత్తాలను అందుకోవడానికి వీలుంటుంది.

**114 ఫార్ములా..**

ఈ ఫార్ములాను మన పెట్టుబడులు ఎప్పుడు మూడింతలవుతాయో తెలుసుకోవడానికి వినియోగించవచ్చు. ఉదాహరణకు లక్ష రూపాయల పెట్టుబడిపై 12 శాతం రిటర్న్స్ వస్తుంటే.. 114ను 12 భాగాలుగా విభజించాలి. అప్పుడు 9.5 ఏండ్లలో పెట్టుబడులు మూడింతలవుతాయన్న అంచనాకు రావచ్చు. అలాగే ఈ ఫార్ములా ప్రకారం మన పెట్టుబడులు 6 ఏండ్లలో రెట్టింపు, 12 ఏండ్లలో నాలుగింతలవుతాయి. 9 శాతం వడ్డీ వస్తే పెట్టుబడి రెట్టింపునకు 8 ఏండ్లు పడుతుంది. 16 ఏండ్లలో నాలుగింతలువుతుంది.

**ద్రవ్యోల్బణం ఎఫెక్ట్..**


ఇక మీ పొదుపును ద్రవ్యోల్బణం ఎలా మింగేస్తుందో కూడా ఈ ఫార్ములాలతోనే తెలుసుకోవచ్చు. అందుకు ద్రవ్యో ల్బణం రేటుతో రూల్ 72, రూల్ 114ను ద్రవ్యోల్బణంతో లెక్కించాలి. ఉదాహరణకు ద్రవ్యోల్బణం 6 శాతంగా ఉంటే.. 72ను 6 భాగాలుగా విభజించాలి. 12 వస్తుంది. దీంతో మీరు పెట్టిన పెట్టుబడుల విలువ 12 ఏండ్ల తర్వాత సగానికి పడిపోతుందనుకోవచ్చు. దీన్నిబట్టి 19 ఏండ్లకు మూడో వంతు, 24 ఏండ్లకు పావు వంతు విలువే మిగులుతుంది. అంటే ఇప్పుడు 10 రూపాయలకు దొరికే వస్తువు కోసం 12 ఏండ్ల తర్వాత మీరు 20 రూపాయలను వెచ్చించాల్సి వస్తుందన్నమాట. దీన్నిబట్టి పెట్టుబడులను పెంచుకుంటూపోతే భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందుల్నైనా తేలిగ్గా జయించవచ్చు.




# హలో.. ఇస్మార్ట్ ఇన్వెస్టర్


## పెట్టుబడులపై ఈ ఏడాది ప్లానేంటి?

*కొత్త సంవత్సరం మొదలైంది. గత ఏడాది అనుభవాలు.. వాటి నుంచి నేర్చుకున్న పాఠాలు ఇంకా మన ముందు కనిపిస్తూనే ఉన్నాయి. వృత్తిగత, వ్యక్తిగత జీవితాల విషయంలో ఎలాంటి ప్రణాళిక అవసరమో.. ఫైనాన్షియల్ టార్గెట్‌లను కూడా అంతే పద్ధతిగా చేరుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక లక్ష్యాలను చేధించే క్రమంలో ఏడాది మొదట్లోనే పక్కాగా ప్లాన్ చేసుకోవడం ఉత్తమం.*



**ప్రపంచ** పరిణామాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు మనం వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే సక్సెస్‌ఫుల్, స్మార్ట్ ఇన్వెస్టర్ అనిపించుకుంటాం. ఈ క్రమంలో 2024లో ఉన్న పెట్టుబడి మార్గాలు ఏమేం ఉన్నాయో చూద్దాం..

**స్టాక్ మార్కెట్లు**



నిరుడు దేశీయ స్టాక్ మార్కెట్లలో నిఫ్టీ 20 శాతం వరకూ రాబడిని అందించింది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు, కొత్త ప్రభుత్వ ఏర్పాటు, సంస్కరణలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు వంటివి ప్రధానంగా మార్కెట్లపై ప్రభావం చూపిస్తాయనుకోవచ్చు. డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో 42 లక్షల డీమ్యాట్ ఖాతాలు ఓపెన్ అయ్యాయి. ఇదో ఆల్‌టైం రికార్డ్. దేశీయ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలో సుమారు రూ.15 లక్షల కోట్ల ఆస్తులున్నాయి. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు, ప్రత్యక్ష పన్నుల్లో వృద్ధి తదితర గణాంకాలు కూడా బాగానే ఉన్నాయి. అయితే స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో విపరీతమైన ఉత్సాహం కనిపిస్తోంది. బీఎస్ఈలో రికార్డు స్థాయిలో స్టాక్స్ అప్పర్ సర్క్యూట్స్ దగ్గర లాక్ అవుతున్నాయి. ఇది కాస్త రిస్కీగా కనిపిస్తోంది. దీంతో 2021–23 మధ్య వచ్చిన లాభాలు ఈసారి నిఫ్టీలో వచ్చేట్టు కనిపించడం లేదనే చెప్పాలి. సింగిల్ డిజిట్ లాభాలకు పరిమితం కావచ్చని రీసెర్చ్ సంస్థలూ అంచనా కడుతున్నాయి. కాబట్టి నిపుణుల సలహాలతో ముందుకెళ్తే ఆకర్షణీయ ఫలితాలను అందుకోవచ్చు.

### బంగారం

2023లో బంగారంపై పెట్టుబడులు 13 శాతం లాభాలను ఇచ్చాయి. గత పదేండ్లలో ఎంసీఎక్స్ గోల్డ్ 119 శాతం రాబడులను అందించింది. 20 ఏండ్లలో యావరేజ్ రిటర్న్స్ 12 శాతం వరకూ వర్కవుట్ అయ్యాయి. అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, ఉక్రెయిన్–రష్యా యుద్ధం, యూఎస్–రష్యాల్లో ఎన్నికలు, రూపాయి మారకం విలువలో ఒడిదుడుకులు వంటి అనేక అంశాలు బంగారంపై ప్రభావాన్ని చూపించబోతున్నాయి. పైగా అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 2000 డాలర్లపైనే స్థిరంగా ట్రేడవుతోంది. దీంతో యూఎస్ బాండ్ ఈల్డ్స్, ఈక్విటీల్లోకి నిధులు వంటి అంశాలెన్నో కూడా పసిడిపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నది. ఈ ఏడాది 10 గ్రాముల 24 క్యారెట్ గోల్డ్ రూ.70–71వేల వరకూ వెళ్లే అవకాశాలున్నాయని టెక్నికల్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు. కనుక మన పొదుపులో గరిష్ఠంగా 5–10 శాతం వరకూ గోల్డ్‌వైపు మళ్లించవచ్చు. అది కూడా సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌ల వంటివి ఇంకా బెటర్.

**బాండ్లు–డిపాజిట్లు**

బాండ్లు, డిపాజిట్లపై పెట్టుబడులనూ పరిశీలించవచ్చు. ప్రస్తుతం ఆయా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై ఆకర్షణీయమైన వడ్డీరేట్లనే ఇస్తున్నాయి. 7.5 శాతం నుంచి 9 శాతం వరకున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఏడాది వడ్డీరేట్ల విషయంలో మెత్తబడుతుందన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తగ్గవచ్చు. అయినప్పటికీ రక్షణాత్మక పెట్టుబడుల్లో ఈ డిపాజిట్లకు స్థానం ఉండనే ఉంటుంది. బాండ్ల విషయానికొస్తే.. వీటిపై పెట్టుబడులకు పన్ను మినహాయింపులనూ పొందవచ్చు. ఆర్బీఐ జారీచేసే బాండ్లను పరిశీలించవచ్చు. అలాగే ఇతర సంస్థల బాండ్లనూ ఎంచుకోవచ్చు. అయితే గతంలో వాటి రాబడులు ఎలా ఉన్నాయన్న దానిపై విశ్లేషించి ఓ నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

### రియల్ ఎస్టేట్

కరోనాకు ముందుతో పోల్చితే ఆ తర్వాతే దేశీయ నిర్మాణ రంగంలో ఉత్సాహం కనిపిస్తున్నది. హైదరాబాద్‌తో పాటు ముంబై, ఢిల్లీ, గుర్గావ్, బెంగళూరు నగరాల్లో రెసిడెన్షియల్ సేల్స్ రికార్డులు కొట్టాయి. ప్రాపర్టీ కన్సల్టెంట్ల విశ్లేషణల ప్రకారం హౌజింగ్ సేల్స్‌లో గత ఏడాది హైదరాబాద్‌లో సుమారు 49 శాతం వృద్ధి నమోదైంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు నేపథ్యంలో కొత్త సర్కారు విజన్‌పై ఇంకా క్లారిటీ రావాల్సి ఉన్నది. దీంతో అప్పటిదాకా రియల్ ఎస్టేట్ రంగంలో కనీసం 9 నెలలపాటు స్తబ్ధత ఉండొచ్చునేది రియల్ ఎస్టేట్ రంగ నిపుణుల మాట. కమర్షియల్–అగ్రి థీమ్స్‌పై కూడా ఆసక్తి పెరుగుతోంది. కనుక ట్రెండ్‌నుబట్టి ముందుకెళ్తే మెరుగైన రాబడులను పొందవచ్చు.

**చివరగా..**

జీవిత బీమా, ఆరోగ్య బీమాలకూ పెద్దపీట వేయండి. ఇటు పెట్టుబడిగా, అటు మన కుటుంబాలకు ఆసరాగా కూడా వీటిని పరిగణించి ఓ నిర్ణయం తీసుకోండి. రేపటి రోజన్నది ఎలా ఉంటుందో మనకు తెలియదు. మనం లేని లోటును మనవారికి నేడు మనం చేసే ఈ బీమానే తీర్చగలదు.

-నాగేంద్రసాయి కుందవరం

## బ్రేక్‌అవుట్ మార్కెట్



**ఇన్ఫోసిస్,** టీసీఎస్ ఫలితాల ప్రభావంతో జరిగిన భారీ షార్ట్ కవరింగ్‌తో 2 వారాల శ్రేణి నుంచి మార్కెట్ బ్రేక్‌అవుట్ సాధించింది. 21,928 పాయింట్ల కొత్త స్థాయిని తాకిన ఎన్ఎస్ఈ నిఫ్టీ గతవారం 184 పాయింట్లు లాభపడి 21,895 వద్ద ముగిసింది. డిసెంబర్ 28 నుంచి 21,500–21,800 శ్రేణి మధ్య హెచ్చుతగ్గులకు లోనవుతున్నదని, శుక్రవారం 21,800 స్థాయిని బేర్స్ నుంచి బుల్స్ చేజిక్కించుకున్నారని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది చెప్పారు. అయితే రెలిటివ్ స్ట్రెంత్ ఇండెక్స్ బేరిష్ డైవెర్జన్స్ ప్రదర్శిస్తున్నదని, వీక్లీ చార్టు ల్లో నిఫ్టీ బలహీనతను సూచిస్తున్నదని హెచ్చరించారు. డెయిలీ, వీక్లీ టైమ్ ఫ్రేమ్‌ల్లో బ్రేక్‌అవుట్ జరిగినందున, ఈ వారం పెరిగే అవకాశం ఉన్నదని యాక్సిస్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ రాజేశ్ అంచనా వేశారు.

**మద్దతు 21,750–21,800**

గత రెండు వారాల శ్రేణిలో అప్పర్‌బ్యాండ్ 21,800 స్థాయిని చేధించినందున, ఈ వారం ఇదే స్థాయి తక్షణ మద్దతుగా నిలుస్తుందని జిమిత్ మోది విశ్లేషించారు. తదుపరి కొనుగోళ్లతో 22,000కు వెళ్లవచ్చన్నారు. ఆపై మరింత ర్యాలీకి వీలుందన్నారు. ఆప్షన్ రైటింగ్ యాక్టివిటీ ప్రకారం ఈ వారం తొలుత 22,000 పాయింట్ల వద్దకు చేరవచ్చని, దీన్ని బలంగా దాటితే 22,200 పాయింట్లను అందుకోవచ్చని రాజేశ్ పాల్వియా అంచనా వేశారు. 21,750 పాయింట్ల స్థాయి వద్ద లభించబోయే మద్దతు మార్కెట్‌కు కీలకమని చెప్పారు.

## ట్యాక్స్-సేవింగ్ ఎఫ్‌డీలు

### 7 శాతం వరకు వడ్డీరేటు

**బ్యాంకుల్లో** ట్యాక్స్–సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)తో అధిక వడ్డీ, పన్ను ఆదా ప్రయోజనాలను పొందవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే పాత పన్ను విధానాన్ని ఎంచుకున్నవారికే ఈ సౌలభ్యం ఉంటుంది. ఇక ఈ ఎఫ్‌డీ ఖాతాపై ఐదేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో విత్‌డ్రాకు వీలుండదు. రుణాలనూ తీసుకోలేము. టీడీఎస్ రూల్స్, రెగ్యులేషన్లకు లోబడి ఎఫ్‌డీ ఉంటుంది. ఫామ్ 15హెచ్/15జీ సమర్పిస్తే మనం పొందే వడ్డీపై టీడీఎస్ ఉండదు. సీనియర్ సిటిజన్లకు అదనంగా అర శాతం వరకు వడ్డీరేటు ఎక్కువగా లభిస్తుంది. కస్టమర్ కోరుకుంటే ఒక శాఖ నుంచి మరో శాఖకు తమ ఎఫ్‌డీని బదిలీ చేసుకోవచ్చు. కాగా, ఎస్బీఐ, పీఎన్‌బీల్లో ఈ ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు 6.5 శాతంగా, కెనరా బ్యాంక్‌లో 6.7 శాతంగా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్, యెస్ బ్యాంకుల్లో 7 శాతం. కొటక్ మహీంద్రాలో 6. 2 శాతం ఇస్తున్నారు.